సాక్షి
అనంతపురం

శుక్రవారం, 19, జూన్, 2026



టీబీ డ్యాంలో 9.88 టీఎంసీల నీరు

తుంగభద్ర జలాశయంలో గురువారం నాటికి 9.880 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 283 క్యూసెక్కులు నమోదైంది.

చీనీ టన్ను రూ.35 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.35 వేలు పలికాయి.

గరిష్టం/కనిష్టం
37.5°/24.3°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. ఉక్కబోత కొనసాగింది. నైరుతి దిశగా గంటకు 10 నుంది 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

కుంటను మింగేశారు!

మన్నీలలో మైనింగ్ కంపెనీ నిర్వాహకుల ఇష్టారాజ్యం

- కుంటను పూడ్చి 13.16 ఎకరాల ఆక్రమణ
- ఇప్పటికే 4 ఎకరాలకు కంచె
- గ్రామస్తులు, రైతులు ఫిర్యాదు చేసినా అధికారుల మౌనం

గతంలో ఉన్న కుంటలో నీరు తాగుతున్న గొర్రెలు, మేకలు



ప్రస్తుతం కానరాని కుంట

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం మన్నీల గ్రామంలోని సర్వే నం.28లో కంకర మిషన్‌కు అనుమతి పొందిన ఓ కంపెనీ, పక్కనే ఉన్న సర్వే నంబరు 26లోని 13.16 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులకు ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్వే నం.26లో ఉన్న సహజ వర్షపు నీటి కుంట రైతులు, పశుపోషకులకు కొండంత అండగా ఉండేది. కొండపై నుంచి వచ్చే వర్షపు నీరు కుంటలో చేరేది. దీంతో భూగర్భ జలాలు పెరిగేవి. పశువులు, గొర్రెలు, మేకలకు తాగునీటి మనరుగా ఉపయోగపడేది. ప్రస్తుతం ఆ కుంటను మైనింగ్ వేస్ట్, మట్టి, గుండ్రాళ్లతో పూర్తిగా పూడ్చి వేశారని స్థానికులు చెబుతున్నారు.

అనుమతి ఒక చోట... కార్యకలాపాలు మరోచోట!

సర్వే నంబరు 28లో మైనింగ్ తవ్వకాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.అయితే సర్వేనం. 26లో మైనింగ్ వేస్ట్ డంపింగ్, నిర్మాణాలు, ఫెన్సింగ్ చేపట్టడం వెనుక ఎవరి హస్తం ఉందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గనులు, భూగర్భశాఖ అధికారులు సర్వే నంబరు 26లో ఎలాంటి క్వారీ లీజు లేదని చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉందని గ్రామస్తులు అంటున్నారు.

పొలాల దారులు మూసివేత

సర్వే నంబరు 27లో 50 ఎకరాలకు పైగా రైతుల భూములు ఉన్నాయి. ఆ భూములకు వెళ్లే ప్రధాన మార్గం సర్వే నం. 26 ద్వారానే ఉండేది. ప్రస్తుతం అక్కడ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో రైతులు తమ పొలాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మండల స్థాయి అధికారుల నుంచి కలెక్టర్ వరకు అనేకమార్లు వినతిపత్రాలు ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదని రైతులు, ప్రజా సంఘాల నాయకులు అంటున్నారు. ఆక్రమాలపై ప్రశ్నించిన వారిపైనే తప్పుడు కేసులు పెట్టడం, పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ఒత్తిడి తేవడం జరుగుతోందని వాపోతున్నారు.

అధికారులే అండగా నిలుస్తున్నారు

సర్వే నంబరు 26లో ఎలాంటి అనుమతులు లేకుండానే కంకర మిషన్ యాజమాన్యం రెండంతస్తుల భవనం నిర్మించింది. 30 అడుగుల ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. నీటి కుంటను పూడ్చివేసి, మైనింగ్ నుంచి వచ్చిన వేస్ట్ మట్టిని డంపింగ్ చేశారు. దీనిపై అన్ని శాఖల అధికారులకు ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోలేదు. సమస్యను పరిష్కరించాల్సిందిపోయి రైతులు, ప్రజా నాయకులపైనే తప్పుడు కేసులు నమోదు చేయించారు.

– టి.రామాంజనేయులు, సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి, మన్నీల

వర్షపు నీరంతా పొలాల్లోకి వస్తోంది

సర్వే నంబరు 25లో నాకు 4.20 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. భూమికి అనుకుని ఉన్న సర్వే నంబరు 26లో వర్షపు నీటి కుంట ఉండేది. కొండలో నుంచి వచ్చే వర్షపు నీరంతా కుంటలో చేరి నిల్వ ఉండేది. దీంతో ఎలాంటి ఇబ్బంది ఉండేదికాదు. కుంటను పూడ్చివేయడంతో వర్షపు నీరు నేరుగా నా పొలంలోకి చేరి పంటలకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తోంది. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదు.

– ఎం. రమేష్, రైతు, మన్నీల

గనుల, భూగర్భశాఖ నిర్ణయం తీసుకోవాలి

మన్నీల సర్వే నంబరు 26లోని ప్రభుత్వ భూమిలో మైనింగ్ అనుమతుల కోసం సదరు కంపెనీ వారు దరఖాస్తు చేసుకున్నారు. దానిపై గతంలో ఉన్న అధికారులు నివేదిక ఇచ్చారు. గ్రామస్తులు, రైతుల ఫిర్యాదు మేరకు అక్కడికి వెళ్లి పరిశీలించాం. మైనింగ్ అనుమతులపై గనుల భూగర్భ శాఖ అధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. పెద్ద భవనం నిర్మించడం, కుంటను పూడ్చేయడం, చుట్టూ ఫెన్సింగ్ వేయడంపై గనుల భూగర్భ శాఖ అధికారులు అనుమతులు ఇచ్చారేమో కనుక్కోవాలి.

– ఉదయ్‌భాస్కర్, తహసీల్దారు, అనంతపురం రూరల్

ఆ ప్రిన్సిపాల్‌పై సస్పెన్షన్ వేటు

- రాసిన పరీక్షనే మళ్లీ రాయించడంపై ఎస్కేయూ వీసీ ఆగ్రహం
- 9 మంది విద్యార్థులకు నేడు అదే కేంద్రంలో పరీక్ష

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం: రాసిన పరీక్షనే విద్యార్థులతో మళ్లీ రాయించిన ప్రిన్సిపాల్‌పై సస్పెన్షన్ వేటు పడింది. అనంతపురం నగరంలోని శ్రీశ్రీనివాస డిగ్రీ కళాశాలలో సోమవారం జరిగిన ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ పరీక్షను మంగళవారం మళ్లీ నిర్వహించారు. తప్పును గుర్తించిన ఎస్కేయూ పరీక్షల విభాగం అధికారులు 15 నిమిషాల అనంతరం ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ ప్రశ్నపత్రాన్ని మెయిల్ ద్వారా పంపినా సదరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అదినారాయణ రెడ్డి నిర్లక్ష్యం వహించారు. బలవంతంగా 9 మంది విద్యార్థులతో పరీక్ష రాయించారు. విద్యార్థులు బతిమలాడినా కనికరించలేదు. ఈ అంశంపై 'సాక్షి'లో గురువారం కథనం వెలువడడంతో ఎస్కేయూ వీసీ జ్యోతి కుమార్ స్పందించారు. ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించడంతో పాటు ఆయా విద్యార్థులకు శుక్రవారం అదే కేంద్రంలో మళ్లీ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

పరీక్షల విభాగం అధికారులపై చర్యలేవీ..?

షెడ్యూల్ ప్రకారం నిర్దేశించిన ప్రశ్నపత్రాన్ని ఆయా కళాశాలలకు పంపాల్సిన బాధ్యత ఎస్కేయూ పరీక్షల విభాగం అధికారులపై ఉంటుంది. అయితే, నిర్లక్ష్యంగా వ్యవహరించి ఒక సబ్జెక్టుకు బదులు మరొక సబ్జెక్టు ప్రశ్నపత్రం పంపి వర్సిటీ ప్రతిష్ఠను మసకబార్చారు. దీనిపై ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా పరీక్షలకు హాజరైన విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ భవిష్యత్తుతో ఆటలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, ఎస్కేయూ పరీక్షల విభాగం అధికారులు చేసిన తప్పును తేలికగా తీసుకుని, కేవలం ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవడం సర్వత్రా విమర్శలకు తావిచ్చింది. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రైవేట్ ఉద్యోగం కాబట్టి వారం తర్వాత అతడిని విధుల్లోకి తీసుకున్నా ఎవరూ ప్రశ్నించలేరు. కానీ, ఎంతో జవాబుదారీతనంతో వ్యవహరించాల్సిన ఎస్కేయూ పరీక్షల విభాగం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడమే చర్చనీయాంశంగా మారింది.

న్యూస్‌రీల్

యోగాతో ఆనందకర జీవితం

యోగా సాధన చేస్తున్న కలెక్టర్ ఆనంద్

తాడిపత్రి టౌన్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం తాడిపత్రి పట్టణంలోని పురాతన బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ ఆనంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణ ప్రముఖులతో పాటు విద్యార్థులు హాజరై యోగాసనాలు వేశారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ యోగాతోనే ఆనందకర జీవితం సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరికీ యోగాపై అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా టూరిజం అధికారి ఓబుళమ్మ, మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- 17 మందికి గాయాలు

తీవ్రంగా గాయపడిన నాగవేణి,వంశీకృష్ణ

గుత్తి రూరల్: మండలంలోని బసినేపల్లిలో గురువారం లారీని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో 17 మందికి గాయాలయ్యాయి. ప్రయాణికులు తెలిపిన మేరకు.. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు 45 మంది ప్రయాణికులతో మంత్రాలయం నుంచి ధర్మవరానికి బయలుదేరింది. మార్గమధ్యంలో బసినేపల్లి వద్ద స్పీడ్ బ్రేకర్‌ను లారీ దాటుతుండగా, వెనుక నుంచి ఢీకొంది. దీంతో బస్సు అద్దాలు పగిలిపోయాయి. తెలంగాణ రాష్ట్రంలోని గద్వాలకు చెందిన కవిత, బజకు చెందిన జయమ్మ, గోపాల్, ఫిలిప్, కీర్తన, కవిత, అశ్విని, అంకిత, సింధుజా, అనంతపురం నగరానికి చెందిన ఇమామ్‌బీ, షాజహాన్, సానియా, షబానా, సావిత్రి, గుత్తికి చెందిన సుజాత, ఎమ్మిగనూరుకు చెందిన నాగవేణి, పత్తికొండ మండలం హోసూరుకు చెందిన వంశీకృష్ణ గాయపడ్డారు. వారిని 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు తీవ్రంగా గాయపడిన కవిత, జయమ్మ, నాగవేణి, వంశీకృష్ణను అనంతపురం, కర్నూలుకు తీసుకెళ్లారు. సంఘటన స్థలాన్ని గుత్తి ఆర్టీసీ డిపో అధికారులు పరిశీలించారు. బస్సు ఢీకొన్నా లారీ డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోవడం గమనార్హం. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇబ్బందులు పెడుతున్నారు 'సర్'

అనంతపురం అర్బన్: స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) నిర్వహణలో ఎన్నికల సిబ్బంది అయోమయానికి గురవుతున్నారు. ఎన్యుమరేషన్ విషయంలో బీఎల్ఓలకు సరైన అవగాహన లేకపోవడం... 2002లో ఉన్న ఓటు వివరాలు ఇవ్వాలంటూ ఒత్తిడి చేస్తుండడంతో ఓటర్లకు ఇబ్బందులు తప్పడం లేదు. 2002లో ఓటు ఎక్కడ ఉంది, పోలింగ్ బూత్, పార్ట్ నంబర్ తదితర వివరాలు చెప్పాలని కోరుతుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఓటరు తన ఓటు 2002లో ఏ ప్రాంతంలో ఉంది, ఆ ప్రాంతం ఏ నియోజకవర్గంలో ఉంది అనే వివరాలను ఎన్యుమరేషన్ ఫారంలో నమోదు చేస్తే సరిపోతుందని ఉన్నతాధికారులు చెబుతుండడం గమనార్హం. ఆ వివరాల ఆధారంగా సరిచూసుకుంటామని, స్పష్టత లేకపోతే నోటీసు ఇస్తారని తెలియజేస్తున్నారు.

క్షేత్రస్థాయికి వెళ్లకుండా..

బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు ఇచ్చి వివరాలు సేకరించాల్సి ఉంది. అయితే చాలా మంది ఇంటింటి సందర్శన చేయడం లేదు. సచివాలయంలో కూర్చుని ఓటర్లను అక్కడికే రప్పించి వివరాలను తీసుకుంటున్నారు. గ్రామాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. ఇక.. ఈ నెల 15న ఎస్ఐఆర్ ఫారం భర్తీతో అధికారిక నివేదిక ప్రకారం 18వ తేదీ నాటికి 74 మంది బీఎల్ఓలు ఎన్యుమరేషన్ ప్రక్రియ ప్రారంభించకపోవడం గమనార్హం.

ఎన్యుమరేషన్ ఇవ్వాల్సిందే...

ఎన్యుమరేషన్ ఫారాన్ని ఓటరు తప్పనిసరిగా బీఎల్ఓకు ఇచ్చి ఎండార్స్‌మెంట్ తీసుకోవాలి. ఎన్యుమరేషన్ ఫారం ఇవ్వని వారి ఓటుకు చేటు తప్పదు. ఎన్యుమరేషన్ ఫారం సమర్పించని వారి ఓటు జాబితా 21న ప్రచురించే ముసాయిదా జాబితాలో ఉండదు. ఓటు కోసం మరోసారి దరఖాస్తు చేసుకోవాల్సి వస్తుంది. ఈ క్రమంలో రాజకీయ పార్టీలకు చెందిన బీఎల్ఏలు (బూత్ లెవల్ ఏజెంట్లు) క్రియాశీలకంగా వ్యవహరించాల్సి ఉంది. ఫారాన్ని సమర్పించేలా చూడడంతో పాటు ఎండార్స్‌మెంట్ ఇప్పించాలి.

బీఎల్ఓలకు స్పష్టమైన ఆదేశాలిచ్చాం

ఎన్యుమరేషన్ విషయంలో బీఎల్ఓలపై వస్తున్న ఫిర్యాదులపై ఈఆర్ఓలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించాం. బీఎల్ఓలకు స్పష్టమైన ఆదేశాలిచ్చాం. 2002లో ఓటరు ఎక్కడ ఉన్నారనే వివరం తీసుకుంటే సరిపోతుంది. ఒక వేళ తనకు ఓటు లేకపోతే వారి నాన్న లేదా తాత ఓటు ఎక్కడ ఉండేదనే విషయం చెప్పినా సరిపోతుంది. కచ్చితంగా ఈ వివరాలే ఇవ్వాలని, లేదంటే మీ ఓటు ఉండదు అంటూ ఓటర్లను బీఎల్ఓలు ఇబ్బంది పెట్టకూడదని గట్టిగా హెచ్చరించాం. ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎన్యుమరేషన్ ఫారం సమర్పించాలి.

– ఎ.మలోల, జిల్లా రెవెన్యూ అధికారి

టీచర్ల విభజన కసరత్తు వేగవంతం

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి అనంతపురం జిల్లా విభజన నేపథ్యంలో ఉపాధ్యాయుల కేటాయింపు ప్రక్రియ వేగం పుంజుకుంది. ఉపాధ్యాయులను అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు విభజించేందుకు విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా అన్ని కేడర్ల ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులతో సమావేశాలు నిర్వహిస్తోంది.

డివిజన్ల వారీగా..

మొదటి రోజు అనంతపురం విద్యా డివిజన్ పరిధిలోని వివరాలను పరిశీలించిన అధికారులు, రెండో రోజు గురువారం గుత్తి డివిజన్‌కు చెందిన ఎంఈఓలు, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలతో అనంతపురం సైన్స్ సెంటర్‌లో సమావేశం నిర్వహించారు. సీనియార్టీ జాబితాల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా ఉండేందుకు ప్రతి పేరును పరిశీలిస్తూ క్రమీకరణ ప్రక్రియ చేపట్టారు. ఇన్‌చార్జ్ డీఈఓ శ్రీనివాసరావు, గుత్తి డీవైఈఓ లక్ష్మన్న, డీఈఓ కార్యాలయ సిబ్బంది, ఐటీ విభాగం అధికారులు పాల్గొని సీనియార్టీ జాబితాల పరిశీలన చేపట్టారు. శుక్రవారం, శనివారం శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోని ఎంఈఓలు, హెచ్ఎంలతో సమావేశాలు నిర్వహించి సీనియార్టీ జాబితాలు, ఖాళీల వివరాలను ఖరారు చేయనున్నారు.

కేడర్‌లో చేరిన తేదీనే ప్రాతిపదిక

ప్రస్తుతం ఉపాధ్యాయుడు ఉన్న కేటగిరీలో సీనియార్టీని పరిగణనలోకి తీసుకుని కేటాయింపులు చేపట్టనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాను యూనిట్‌గా తీసుకుని ప్రక్రియ చేపడుతున్నారు. ఇతర జిల్లాల నుంచి బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులకు సంబంధించి వారు ఇక్కడ విధుల్లో చేరిన తేదీ నుంచే సీనియార్టీ లెక్కించనున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో ఆయా ఉపాధ్యాయుల స్థానాలపై నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది. సస్పెన్షన్‌లో ఉన్నవారు, అనధికారంగా గైర్హాజరైన ఉపాధ్యాయుల పేర్లను కూడా సీనియార్టీ జాబితాల్లో చేర్చాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జిల్లా విభజన ప్రక్రియలో ముందుగా వారిని ఏదో ఒక జిల్లాకు కేటాయించి, అనంతరం క్రమశిక్షణ చర్యలు కొనసాగించేలా ప్రణాళిక రూపొందించారు.

మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీఈఓ శ్రీనివాసరావు

100 శాతం అప్షన్లు తప్పనిసరి

జిల్లా విభజన ప్రక్రియలో ప్రతి ఉపాధ్యాయుడు తప్పనిసరిగా అప్షన్లు ఇవ్వాల్సిందేనని విద్యాశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. అప్షన్లు, సీనియార్టీ, ఖాళీల ఆధారంగా తుది కేటాయింపులు చేపట్టే అవకాశం ఉంది. జిల్లా విభజనతో తమ సేవా ప్రాంతం మారుతుందా.. సీనియార్టీపై ప్రభావం ఉంటుందా? అనే అంశాలపై ఉపాధ్యాయుల్లో ఆసక్తి నెలకొంది.

ఖాళీల భర్తీకి చర్యలు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు విద్యాశాఖ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా టీచర్ల ఖాళీల భర్తీకి తొలి అడుగు వేసింది. ఈ నెలాఖరులోగా ఎంటీఎస్ టీచర్ల బదిలీల ప్రక్రియ పూర్తి చేసి, అనంతరం ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టాలని విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా ఆదేశాలు జారీ చేశారు.

ముందుగా ఎంటీఎస్ టీచర్లకే అవకాశం

గురువారం నిర్వహించిన వెబెక్స్ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారులకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఖాళీలను ముందుగా గుర్తించి, వాటికి ఎంటీఎస్ టీచర్ల నుంచి అప్షన్లు స్వీకరించాలని పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించడం ద్వారా విద్యార్థులకు బోధనలో అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. బదిలీలు, సర్దుబాట్ల తర్వాత కూడా ఉపాధ్యాయుల కొరత కొనసాగితే అకడమిక్ ఇన్స్ట్రక్టర్లను నియమించనున్నారు.

ఉమ్మడి జిల్లాలో 550 మంది..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1998, 2008 డీఎస్సీ ద్వారా నియమితులైన ఎంటీఎస్ టీచర్లు 665 మంది వరకు పనిచేసేవారు. ప్రస్తుతం సుమారు 100 మంది పదవీ విరమణ చేశారు. 550 మంది ఎంటీఎస్ టీచర్లు వివిధ పాఠశాలల్లో సేవలందిస్తున్నారు.

వేలం పెడతారు..పాడుకోండప్పో!

బోరంపల్లిలో దండోరా వేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఊరూరా మద్యం బెల్టుషాపులు వెలిశాయి. వీటి కోసం 'తమ్ముళ్ల' మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఇష్టారాజ్యంగా మద్యం అమ్ముకునే వెసులుబాటు ఉండడంతో మంచి ఆదాయం వస్తుందనే ఉద్దేశంతో బెల్టుషాపుల నిర్వహణకు టీడీపీ కార్యకర్తలు ఉత్సాహం చూపుతున్నారు. ఈ క్రమంలోనే గ్రామాల్లో వేలం పాట నిర్వహించి మరీ బెల్టుషాపులు అప్పగిస్తున్నారు. కళ్యాణదుర్గం మండలం బోరంపల్లిలో బెల్టు షాపుల ఏర్పాటు కోసం టీడీపీ నాయకులు గురువారం రాత్రి వేలం పాట నిర్వహణకు సిద్ధమయ్యారు. అంతకుముందు గ్రామంలో దండోరా వేయించారు. వేలంలో పాల్గొనేవారికి స్థానికంగా ఓటు హక్కు ఉండాలని, ఆధార్, పాసుపోర్టు సైజ్ ఫొటోలు కలిగి ఉండాలని, వారి వివరాలు నమోదు చేసుకుని వేలంలో పాల్గొనే అవకాశం కల్పిస్తారని దాటింపు వేయడం గమనార్హం. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో నియోజకవర్గ ప్రజాప్రతినిధి సూచన మేరకు వేలంపాట నిర్ణయాన్ని 'తమ్ముళ్లు' విరమించుకున్నట్లు తెలుస్తోంది. ఒకవైపు గ్రామాల్లో బెల్టుషాపులు పెడితే తాట తీస్తామని సీఎం చంద్రబాబు ప్రకటనలు చేస్తుండగా..మరోవైపు ఆయన పార్టీ వారే పల్లెల్లో దండోరా వేయించి మరీ బెల్టు షాపులకు వేలం నిర్వహిస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

మైనార్టీలపై బండ బూతులు

- రెచ్చిపోయిన మంత్రి పయ్యావుల అనుచరుడు!

సాక్షిటాస్క్‌ఫోర్స్: రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అనుచరుడు, ఉరవకొండ మండల టీడీపీ నాయకుడు రవి మద్యం మత్తులో బుధవారం రాత్రి వీరంగం సృష్టించాడు. ఉరవకొండలోని అనంతపురం-బళ్లారి జాతీయ రహదారి వద్ద ఉన్న ఓ ధాబా వద్ద మద్యం మత్తులో అందరూ చూస్తుండగానే అక్కడే ఉన్న కొందరు మైనార్టీలను ఇష్టారాజ్యంగా దుర్భాషలాడినట్లు తెలిసింది. తనకు మంత్రి అండదండలు ఉన్నాయని, ముస్లింలు ఏం పీక్కోలేరని రెచ్చిపోయినట్లు సమాచారం. ఈ ఘటన ఉరవకొండ పట్టణంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

'ఫస్ట్'లో 34 శాతం, సెకండ్‌లో 51 శాతం

- ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల విడుదల

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. జిల్లాలో మొత్తం 147 కళాశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, ప్రథమ సంవత్సరంలో కేవలం 34 శాతం, ద్వితీయ సంవత్సరంలో 51 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. కొన్ని యాజమాన్యాలు ఆశించిన ఫలితాలు సాధించగా, మరికొన్ని జిల్లా సగటును కూడా అందుకోలేకపోయాయి. జిల్లాలో 23 ప్రభుత్వ కళాశాలల నుంచి ప్రథమ సంవత్సరంలో 1,265 మంది పరీక్షలకు హాజరుకాగా 450 మంది (35.57 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 1,042 మందిలో 540 మంది (51.82 శాతం)ఉత్తీర్ణత సాధించారు. రెండు ఎయిడెడ్ కళాశాలల ఫలితాలు ఆందోళన కలిగించేలా ఉన్నాయి.ప్రథమ సంవత్సరంలో 398 మంది హాజరుకాగా కేవలం 88 మంది మాత్రమే 22.11 శాతం ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరంలో 50.61 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే రెసిడెన్షియల్ కళాశాలలు ప్రథమ సంవత్సరంలో 48.64 శాతం, ద్వితీయ సంవత్సరంలో 69.56 శాతం ఉత్తీర్ణత, 15 ఏపీ మోడల్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం 31.89 శాతం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 53.79 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇక 32 కేజీబీవీల్లో ప్రథమ సంవత్సరంలో 53.28 శాతం, ద్వితీయ సంవత్సరంలో ఉత్తీర్ణత 50 శాతం ఉత్తీర్ణత సాధించారు. 66 ప్రైవేట్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం 34.07 శాతం, ద్వితీయ సంవత్సరంలో 50.69 శాతం ఉత్తీర్ణత సాధించారు.

పట్టపగలే కొల్లగొట్టారు!

యాడికి: మండలంలోని చందన గ్రామంలో గురువారం దొంగలు బీభత్సం సృష్టించారు. పట్టపగలే ఇంట్లోకి చొరబడి కొల్లగొట్టారు. వివరాలిలా ఉన్నాయి. చందన గ్రామానికి చెందిన తంగసాని పెద్ద యల్లారెడ్డి గురువారం ఉదయం తన భార్యతో కలిసి ఇంటికి తాళం వేసుకుని తాడిపత్రికి వెళ్లాడు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఇంటికి తిరిగొచ్చిన వారికి తాళం పగుల గొట్టి ఉండటం కనిపించింది. లోపలికి వెళ్లి చూడగా, బీరువాలోని 36 తులాల బంగారు, రూ.4 లక్షల నగదు కనిపించలేదు. సమాచారం అందుకున్న సీఐ శ్రీనివాసులు ఘటనాస్థలిని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌తో వివరాలు సేకరించారు. బాధితుడు పెద్ద యల్లారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ తెలిపారు.

పంజాబ్ నేషనల్ బ్యాంక్
(భారత ప్రభుత్వ రంగ సంస్థ) ...విశ్వాసానికి మరోపేరు

CO- SAM (స్ట్రెస్డ్ అస్సెట్ మేనేజ్‌మెంట్)
డి.నం.9-35, న్యూస్ బజ్, సత్యమ్ థియేటర్, కరూర్, విజయవాడ, ఆం.ప్ర.-520007. ఫోన్ నెం.: 6362844637
ఈ-మెయిల్: cs8332@pnb.co.in

స్థిరాస్తుల అమ్మకం కొరకు వేలం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 8(6) r/w 9(1) నిబంధనలతో చదవబడే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం నోటీసు

ఇందుమూలముగా నోటీసు జారీచేస్తూ, యావన్మంది ప్రజానీకానికి మరియు ప్రత్యేకంగా బాధ్యతదారు(లు) & హామీదారు(లు)కు నోటీసు జారీచేస్తూ తెలియజేయునది ఏమనగా, దిగువ సెక్యూర్డ్ క్రెడిటర్ గారికి తనఖా ఉంచిన / రాష్ట్రంలో ఉన్న స్థిరాస్తులను నిర్మాణాత్మకంగా / భౌతికంగా / భౌతికంగా స్వాధీనపరచుకోవడం జరిగినది. అధీకృత అధికారిగాను సెక్యూర్డ్ క్రెడిటార్ గారు స్వాధీనత తీసుకుని వారిని "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలాగే పద్ధతి, అక్కడ ఏమున్నదో అదే పద్ధతిపై" దిగువ పట్టికలో తెలిపిన తేదీలలో బ్యాంకు/సెక్యూర్డ్ క్రెడిటార్ గారు సరళ ఐఐఆర్(లు), హామీదారు(లు) నుండి రావలసిన బకాయిలను వసూలు నిమిత్తం ఈ నోటీసు జారీచేస్తున్నారు. ప్రతి ఆస్తికి ఎదుట దిగువ పట్టికలో రిజర్వ్ ధర & ధరావత్తు వివరములు తెలుపబడినవి.

ఇ-వేలం తేది, సమయం : 20-07-2026
**ఉ॥ గం॥ 11.00 నుండి సా॥ గం॥ 4.00 వరక